ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
3
సోమవారం 21 జూలై 2025

వర్షాలు కురిపించవమ్మా సత్యమ్మ తల్లి



అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న భక్తులు

పులివెందుల రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురిపించవమ్మా సత్యమ్మ తల్లి అంటూ ప్రజలు మొక్కుకున్నారు. వర్షాలు బాగా కురిపించి పంటలతో కళకళలాడాలంటూ అమ్మవారికి 108 బోనాలు సమర్పించారు. పులివెందుల మండలం ఎర్రబల్లె పంచాయతీలోని మల్లికార్జునపురంలో ఆదివారం ఉదయం గ్రామంలోని మహిళలు బోనాలతో వెళ్లి సత్యమ్మ తల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు కురిపించాలని వేడుకున్నారు. జంతు బలులు ఇచ్చారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వర్షాలు కురిపించాలని బోనాలు సమర్పించామని భక్తులు తెలిపారు. బోనాల కార్యక్రమంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

హామీలు కొండంత.. చేసింది గోరంత

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ



మాట్లాడుతున్న లక్ష్మీరాజ

కడప ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు కొండంత.. చేసింది గోరంత మాత్రమేనని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేశ్ బాబు విమర్శించారు. ఆదివారం కడప యూటీఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో కూటమి పెద్దలు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని, ఉద్యోగుల పక్షపాతిగా వ్యవహరిస్తామని హామీలు ఇచ్చారన్నారు. కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను నామమాత్రంగానే చెల్లించారని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి తక్షణం ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు డి.సుజాతరాణి, ట్రెజరర్ కె.నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు విడుదల

ప్రొద్దుటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాజుపాళెం మండలం వెల్లాల సంజీవరాయస్వామి, భీమలింగేశ్వర స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి రూ. 3.20 కోట్ల నిధులను దేవదాయ శాఖ మంజూరు చేసింది. ఆ మేరకు ఈ నెల 15న దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఈ ఆలయాల పునర్నిర్మాణంలో సీజీఎఫ్ గ్రాంట్ రూ.3.20 కోట్లకు రూ.80 లక్షల మ్యాచింగ్ కంట్రిబ్యూషన్‌ను డిపాజిట్‌గా నెలలోపు జమ చేయాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. అలాగే ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామం కుమ్మరి వీధిలోని రామాలయం పునర్నిర్మాణానికి కూడా దేవదాయ శాఖ రూ.24 లక్షలు మంజూరు చేసింది. వాటికి మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ కింద రూ.6లక్షలు జమచేయాలని ఉత్తర్వుల్లో తెలిపారు. ఈ ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సీఎం చంద్రబాబునాయుడును, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని కోరారు. ఆ మేరకు ఈ రెండు దేవాలయాలకు నిధులను మంత్రి మంజూరు చేశారు.

జిల్లా కేంద్రమైన కడప గడపలో సమస్యలు పేరుకుపోయాయి. కడప కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్యం పట్టుతప్పింది. వీధి దీపాలు ఆన్‌చేసే వారు లేక కొన్నిప్రాంతాల్లో అంధకారం నెలకొంది. అటు అలంఖాన్ పల్లె నుంచి ఇటు ఓల్డ్‌బైపాస్ వరకు.. ఎక్కడా ఒక్క వీధి దీపం కూడా వెలగడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో తాగునీరు లభించక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇంజనీరింగ్ కార్మికులతో పాటు పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్ల సాధనకై సమ్మెలోకి దిగటంతో ఈ పరిస్థితి తయారైంది. కార్మికులు సమ్మెలోకి దిగిన ఐదు రోజులకే పరిస్థితి ఇలా ఉంటే.. ముమ్ముందు ఇంకెలా ఉంటుందో అర్థం కావడం లేదు.



వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో అల్మాస్‌పేట బ్రిడ్జి

కడప గడపలో సమస్యల కుప్ప..!

- పేరుకుపోతున్న చెత్త
- పలు ప్రాంతాలు అంధకారం
- మరికొన్ని ప్రాంతాల్లో నీటికి కటకట
- ఐదవ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె



చీకట్లో చెన్నూరు బస్టాండ్ ప్రాంతం

కడప ఎర్రముక్కపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధనకు ఇంజనీరింగ్ కార్మికులు ఈనెల 14 నుంచి సమ్మెబాట పట్టారు. వారికి మద్దతుగా పారిశుధ్య కార్మికులు ఈనెల 16 నుంచి సమ్మె ప్రారంభించారు. దీనితో నగరంలో పారిశుధ్యం పట్టు తప్పింది. అలాగే చాలా ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగక రాత్రయితే చాలు అంధకారం నెలకొంటోంది. మరికొన్ని ప్రాంతాల్లో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కడప కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్‌లో ఒప్పంద పారిశుధ్య కార్మికులు సుమారు 18 నుంచి 25 మంది ఉంటారు. వాస్తవానికి వీరి సంఖ్యను ఇంకా పెంచాల్సి ఉన్నా, ప్రభుత్వం ఉన్న వారితోనే పనులు చేయిస్తోంది. ఇక శాశ్వత ఉద్యోగులు అన్ని డివిజన్లలోనూ 133 మంది ఉండగా ఇంజనీరింగ్ కార్మికులు 110 మంది ఉన్నారు. అలాగే ఇంటింటి చెత్తను తరలించేందుకు ఒక సచివాలయానికి ఒక్కో వాహనాన్ని కేటాయించారు. ఒక వాహనానికి ఇద్దరు చొప్పున విధులు నిర్వహిస్తుంటారు. వీరు ఒకరోజు వ్యర్థాలను సేకరిస్తే, మరుసటి రోజు రహదారులను శుభ్రం చేస్తుంటారు.

పలు ప్రాంతాల్లో అంధకారం

ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టడంతో చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంది. చాలా చోట్ల మాన్యువల్ పద్ధతిలో వీధి దీపాలు కొనసాగుతున్నాయి. కార్మికులు సమ్మెలో ఉండడంతో వాటిని ఆపరేట్ చేసేవారు లేక ఆయా ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. ప్రధానంగా అలంఖాన్‌పల్లె మొదలుకొని అల్మాస్‌పేట, చెన్నూరు బస్టాండ్, అంబేడ్కర్ సర్కిల్ నుంచి రాజంపేట రోడ్డు, బిల్టప్ సర్కిల్ నుంచి మద్రాస్ రోడ్డు, ఐటీఐ సర్కిల్, మహావీర్ సర్కిల్ నుంచి రిమ్స్ రోడ్డు వరకు ఇలా నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో వీధిలైట్లు లేక చిమ్మచీకటిగా మారింది. దీనితో ప్రజలు, పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రజలు భయపడుతున్నారు.



అంబేడ్కర్ సర్కిల్ వద్ద వెలగని వీధి దీపాలు

తాగునీటికి కటకట

పలుప్రాంతాల్లో తాగునీరు సరఫరా కావడం లేదు. దీనితో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే కార్పొరేషన్ ప్రత్యామ్నయ ఏర్పాటుగా ట్యాంకర్లు పంపినప్పటికి ఇవి సరిపోవడం లేదు. దీంతో ట్యాంకర్ల వద్ద గొడవలు తప్పడం లేదు. అపార్ట్‌మెంట్‌లలోని వారి బాధలు వర్ణనాతీతమని చెప్పాలి. ఇదే పరిస్థితి కొనసాగితే రహదారులపై వ్యర్థాలు మరింత పేరుకుపోయే ప్రమాదం ఉంది. ప్రత్యామ్నాయంగా ప్రైవేటు వ్యక్తులను పనుల్లో నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే వారిని విధుల్లోకి రానివ్వకుండా కార్మికులు అడ్డుపడుతున్నారు.

కడప కార్పొరేషన్ పరిధిలో...

శాశ్వత సిబ్బంది:	ఇంజనీరింగ్ 110, పారిశుధ్యం 134 మంది
అడిషనల్ కార్మికులు:	ఇంజనీరింగ్ 100, పారిశుధ్యం 487 మంది
ఒప్పంద కార్మికులు:	ఇంజనీరింగ్ 364, పారిశుధ్యం 664 మంది
రోజుకు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు:	291 టన్నులు
రోజుకు ఉత్పత్తి అయ్యే తడి చెత్త:	189
టన్నులు, పొడి చెత్త:	96 టన్నులు
ఇతర వ్యర్థాలు	: 6 టన్నులు



నిలిచిన చెత్త సేకరణ

కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో కార్పొరేషన్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. అయినా రహదారుల శుభ్రత, ఇంటింటి చెత్త సేకరణ మొక్కుబడిగా జరుగుతోంది. చెత్త సేకరణకోసం కార్మికులు రాకపోవడంతో ఇళ్లలోని వ్యర్థాలను బయటకు తీసుకువచ్చి పడేస్తున్నారు. ఐదు రోజులు నుంచి పారిశుధ్య కార్మికుల సమ్మెలోకి వెళ్లడంతో వ్యర్థాలు రోడ్డుమీదే ఉన్నాయి. దీనికి తోడు వర్షం కూడా పడుతుండడంతో పరిస్థితులు అధ్వానంగా మారాయి.

← ఎన్టీఆర్ సర్కిల్‌లో పేరుకుపోయిన చెత్త

లోకం చూడకనే..
అనంతలోకాలకు..!

- కాసులకోసం లింగనిర్ధారణ
- బహిరంగంగా సాగుతున్న బ్రోకర్ల దందా
- క్షేత్రస్థాయిలో ఆగని భ్రూణ హత్యలు
- ప్రకటనలకే పరిమితమైన ప్రచారం
- నిద్రావస్థలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు



ప్రొద్దుటూరు/ప్రొద్దుటూరురూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్ల పుట్టిందంటే బరువు అవుతుందనే ఆలోచన, కొంతమంది వైద్యుల అత్యాశ, పేట్రేగుతున్న బ్రోకర్ల దందా, వైద్యాధికారుల పర్యవేక్షణ లోపం వెరసి ఆడశిశువులకు మరణశాసనం రాస్తున్నాయి. లింగ నిర్ధారణ పరీక్షలపై నిఘా ఉంచాల్సిన యంత్రాంగం పట్టించుకోకపోవడం.. తనిఖీలు సక్రమంగా చేయకపోవడంతో చిట్టితల్లులు లోకాన్ని చూడకుండానే లోకం వీడుతున్నారు. ఆరోగ్యవంతమైన బిడ్డను సమాజానికి అందించే ఉద్దేశ్యంతో అందుబాటులోకి వచ్చిన స్కానింగ్ ప్రక్రియ పక్కదోవ పడుతోంది. కొంతమంది రేడియాలజిస్టులు, సిబ్బంది, స్కానింగ్‌లో తర్ఫీదు పొందిన వైద్యులు కాసులకు కక్కుర్తిపడి గర్భస్థ శిశువు ఆడ, మగ అని చెప్పేస్తున్నారు. తప్పుడు విధానాలతో అబార్షన్లకు యత్నించి మహిళల ప్రాణాల మీదకు తెస్తున్నారు.

రూ.15 వేలకు లింగ నిర్ధారణ

ప్రొద్దుటూరు పట్టణంలో రేడియాలజిస్టులు, గైనకాలజిస్టుల ఆధ్వర్యంలో సుమారు 30 స్కానింగ్ సెంటర్లు నడుస్తున్నాయి. జమ్మలమడుగు సెంటర్‌లో అయిదు ఉన్నాయి. ప్రొద్దుటూరు పట్టణంలో సుమారు 80కి పైగా ప్రైవేటు నర్సింగ్ హోంలు ఉన్నాయి. వీటిల్లో కొన్ని కేంద్రాల్లో రూ.15 వేలు ఖర్చు పెడితే పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అనేది నిర్ధారణ చేస్తున్నారు. వైద్య రంగంలోనే కిందిస్థాయిలో పనిచేసిన కొంతమంది బ్రోకర్ల అవతారమెత్తి బాహాటంగా దందా కొనసాగిస్తున్నారు.

- గతంలో నర్సుగా పనిచేసిన ఒక మహిళ లింగనిర్ధారణ పరీక్షలు చేయించడంలో ఆరితేరింది. ఆమెను సంప్రదిస్తే చాలు.. అయిదవ నెల పడిన గర్భవతులను ఓ నర్సింగ్ హోంలోకి తీసుకెళ్లి స్కానింగ్ చేయిస్తోంది. ఆ తర్వాత నడిరోడ్డు పైనే మహాత్ముని సాక్షిగా వారికి లింగనిర్ధారణ పరీక్షల రిపోర్టును వెల్లడిస్తోంది. వసూలు చేసిన రూ.15 వేలలో తన కమీషన్ తీసుకుని మిగిలిన డబ్బులను స్కానింగ్ నిర్వాహకులకు ముట్టచెబుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.
- పట్టణంలోని వైద్య రంగంలో సహాయకురాలిగా పనిచేసిన మరో మహిళ లింగనిర్ధారణ చేయించుకునేవారికి మధ్యవర్తిగా పనిచేస్తోంది. ప్రస్తుతం ఎర్రగుంట్లలోని విద్యాశాఖలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తోంది. అయినప్పటికి ఈ దందాను కొనసాగిస్తోంది.
- పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులకు సుపరిచితుడైన కొత్తపల్లె పంచాయతీ ఖాదరబాదుకు చెందిన ఓ వ్యక్తి గర్భిణీలను మైదుకూరుకు తీసుకెళ్లి స్కానింగ్ చేయించి లింగనిర్ధారణ వెల్లడించి కాసులు దండుకుంటున్నాడు.
- ప్రకాశం జిల్లా గిద్దలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అతి తక్కువ ధరలకే లింగనిర్ధారణ చేస్తుండడంతో మరికొంతమంది బ్రోకర్లు ఈ ప్రాంతం నుంచి అక్కడికి గర్భిణీలను తీసుకుపోతున్నారని సమాచారం.

ఆడపిల్లల తల్లిదండ్రులే లక్ష్యంగా..

మొదటి కాన్పులో ఆడపిల్లకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను బ్రోకర్లు లక్ష్యంగా ఎంచుకుంటున్నారు. మరో ఆడబిడ్డ పుడితే భారం అవుతుందని చెప్పి లింగనిర్ధారణ, అనంతరం అబార్షన్ల వైపు తీసుకెళుతున్నారు. లింగనిర్ధారణలో ఆడబిడ్డని తేలిన తర్వాత ఆ భారాన్ని తగ్గించే మార్గాన్ని కూడా దగ్గరుండి చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. సుమారు రూ.60 వేలు వసూలు చేసి కొన్ని నర్సింగ్ హోంలలో తల్లి గర్భంలోని ఆడశిశువును చిదిమేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో వైద్యాధికారుల నిఘా కొరవడడంతోనే ఈ వ్యవహారం సాగుతోందనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది అధికారులు మామూళ్ల మత్తులో ఇలాంటి వాటిని చూసీ చూడనట్లు ఉపేక్షిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారం ఇలాగే కొనసాగితే ఆడపిల్లల శాతం బాగా తగ్గిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

- డాక్టర్ గీత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

లింగనిర్ధారణ వివరాలు వెల్లడించడం చట్టరీత్యా నేరం. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వైద్యులైనా, స్కానింగ్ సెంటర్ల టెక్నీషియన్లయినా, రేడియాలజిస్టులైనా నేరస్తులే. వీరికి సహకరించి దళారులుగా వ్యవహరిస్తున్న వారూ శిక్షార్హులే. ఇలాంటి వారిని ఎవ్వరినీ ఉపేక్షించం. లింగనిర్ధారణను ఏ స్కానింగ్ సెంటర్లలో వెల్లడిస్తున్నారు, వారు వాడే కోడ్ లాంగ్వేజి ఏమిటి ? ఏయే ప్రాంతాల్లో ఇలాంటి వ్యవహారాలు జరుగుతున్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటాం. అనధికారికంగా సాగిస్తున్న అబార్షన్లపై కూడా సమాచారం ఉంటే చర్యలు తీసుకుంటాం.

ఈ ఏడాది రూ.50 కోట్లే...


- గత ఏడాది రూ.100 కోట్లు
- మామిడి రైతుకు నష్టాలే...

రైల్వేకోడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఫలాల్లో రాజు అయిన మామిడి ఈ ఏడాది రైతులను నట్టేట ముంచింది. ధరలు పాతాళానికి పడిపోవ డంతో పాటు జ్యూస్ ఫ్యాక్టరీల నుంచి డిమాండ్ లేకపోవడంతో ఈ ఏడాది మామిడి వ్యాపారం సగానికి పడిపోయింది. గత ఏడాది రూ.100 కోట్లకు పైగా జరగ్గా ఈ ఏడాది రూ.50 కోట్లు మాత్రమే జరిగింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో పాటు వాతావరణంలో మార్పులు, బంగారు ఈగల దాడి, కాయల్లో పురుగులు, చీడపీడలు వ్యాపించడంతో డిమాండ్ తగ్గి వ్యాపారం చతికిలపడింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి మార్కెట్‌లోకి మామిడి కాయలు రావడం కూడా ధరలు పడిపోవడానికి ఒక కారణం. అదే కాకుండా కాయలు ఒకేసారి ముదిరిపోవడంతో చెట్లకే మాగిపోయి నేలరాలిపోయాయి. ఈ ఏడాది మామిడి పూతల సమయంలో వాతావరణంలో మార్పుల కారణంగా వచ్చిన పూతలు రాలిపోయాయి. ఆలస్యంగా అయినా పూతలు ఆశించిన స్థాయిలో వచ్చాయి. రైతులు అనేక రకాలుగా ఎరువులు, పురుగు మందులు, నీటి యాజమాన్యం చేపట్టారు. పిందె దశలోనే పలు రకాల సమస్యలను రైతులు ఎదుర్కొన్నారు. కాయలు కొన్ని తోటల్లో నాణ్యతా ప్రమాణాలతో వచ్చాయి. మరికొన్ని తోటల్లో నాణ్యతగా రాలేదు. దీనికి తోడు కాయలకు బంగారు ఈగలు దాడి చేశాయి. కాయల్లో పురుగులు పడటంతో మార్కెట్ పడిపోయింది. బేనీషా, తోతాపూరి, రుమాణి, ఖాదర్, మల్లికా, ఇమాం పసందు, నీలం, కాలేపాడు, నాటురకాల మామిడి కాయలు మార్కెట్‌లోకి వచ్చాయి. సీజన్ మొదట్లో ధరలు ఆశించిన స్థాయిలో ఉన్నా తర్వాత పూర్తిగా పతనమయ్యాయి. రైల్వేకోడూరు మామిడి యార్డులో సుమారుగా 70 మండీలు ఉన్నాయి. ఈ ఏడాది రోజుకు ఇతర రాష్ట్రాలకు 100 లారీల్లో కాయలను ఎగుమతి చేశారు. సీజన్‌లో 8 వేల లారీల్లో కాయలు పంపించారు. రూ.50 కోట్ల మేరకు వ్యాపారం సాగింది. ప్రస్తుతం తోతాపూరి మార్కెట్‌కు టన్ను రూ.8 వేలు, నీలం టన్ను రూ.15 వేలు పలుకుతోంది. ఈనెల 25 తేదీ వరకు మామిడి వ్యాపారం ఉంటుంది. తర్వాత ఉమ్మ కాపు మామిడి కాయలు మార్కెట్‌లోకి వస్తాయి.



రవాణాకు సిద్ధంగా ఉన్న మామిడి లారీలు

గండికోటలో తగ్గుతున్న నీటిమట్టం



కొండాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో రోజురోజుకూ నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నీటిమట్టం తగ్గుతోంది. ప్రస్తుతం 14.19 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచుట మెయిన్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు.

గుట్టుగా..
ఎన్‌హెచ్‌డీసీ తనిఖీలు?

జమ్మలమడుగు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని పలు మండలాల్లో నేషనల్ హ్యాండ్‌లూమ్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌డీసీ) కింద చేనేత మగ్గాల క్లస్టర్లు నిర్వహిస్తుండగా.., అక్కడ అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపణలున్నాయి. అందులో భాగంగా ఎన్‌హెచ్‌డీసీ అధికారులు తనిఖీల కోసం ఈనెల 18వ తేదీ జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదురుగా లాడ్జీలలో రూములు తీసుకుని దిగినట్లు తెలుస్తోంది. జమ్మలమడుగులో క్లస్టర్లు 20, మైలవరంలో 15, వేపరాలలో 10, దొమ్మరనంద్యాల, తదితర గ్రామాల్లో ఎన్‌హెచ్‌డీసీ క్లస్టర్లు ఉన్నాయి. వాటిలో సభ్యత్వం ఉన్న ఒక్కొక్క చేనేత కార్మికుని ఖాతాలో నెలకు రూ.4,800 జమ అవుతాయని ఈసారి రెండు నెలలకు ఒకేసారి డబ్బులు పడ్డాయని తెలిసింది. అందులో చేనేత కార్మికునికి క్లస్టర్ నిర్వాహకులు ఒక్కొక్కరికి రూ.600 నుంచి రూ.800 మాత్రమే అందించినట్లు సమాచారం. ఈ వ్యవహారంతో పాటు చేనేత క్లస్టర్లలో చోటు చేసుకున్న అక్రమాలపై ఎన్‌హెచ్‌డీసీ అధికారులు జమ్మలమడుగుకు వచ్చి చేసిన విచారణను రహస్యంగా ఉంచారు. విచారణకు వచ్చిన వారిని కూడా క్లస్టర్ల నిర్వాహకులు మేనేజ్ చేశారని చేనేత కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికార యంత్రాంగం ముందస్తుగా సమాచారం ఇచ్చి విచారణ చేయాలని వారు కోరుతున్నారు.

రూ.220 కోట్ల ఆస్తి..
ప్రయోజనం నాస్తి..



నిరుపయోగంగా ఉన్న ఇండోర్ స్టేడియం

- నిరుపయోగంగా 20 ఎకరాల క్రీడా మైదానం
- నిర్వహణ లేక పెరిగిన ముళ్ల పొదలు
- జాతీయ స్థాయి క్రీడాకారులున్నా.. శిక్షణకు అవకాశం సున్నా..

రాజంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదునిచ్చి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చి దిద్దేందుకు పలువురు దాతలు 20 ఎకరాల సువిశాల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ప్రభుత్వం ఆ స్థలం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించింది. పట్టణంతోపాటు, చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న పాఠశాలలు, జిల్లా, రాష్ట్ర స్థాయికి చెందిన క్రీడా పోటీలు నిర్వహించాలంటే ఈ క్రీడా మైదానంలో నిర్వహించాల్సిందే. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ లాంటి పలువురు ప్రముఖ నేతల బహిరంగ సభలు కూడా ఈ మైదానంలోనే నిర్వహించారు. అ టువంటి ఈ క్రీడా మైదానంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా క్రీడలకు అధిక ప్రా ధాన్యమిచ్చారు.

రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ కేంద్రంలో వందలాది కోట్ల రూపాయల విలువ చేసే మైదానం రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం. రాజంపేట - రాయచోటి రోడ్డులో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఆనుకుని సుమారు 20 ఎకరాల్లో ఈ క్రీడా మైదానం ఉంది. ఇక్కడ సెంటు రమారమి 50 లక్షలు ఉంటుంది. లోపలి భాగంలో కూడా సరాసరి రూ. 20 లక్షల నుంచి రూ.30 లక్షలు ఉంటుంది. ఈ మొత్తం ఆస్తి విలువ రూ.200 కోట్లకు పైబడే. సుమారు 80 వేల జనాభా కలిగిన రాజంపేట పట్టణంలో ఉన్న ఈ క్రీడా మైదానాన్ని ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల విద్యార్థులు వినియోగించుకుంటున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



రాజంపేట క్రీడా మైదానంలో సౌకర్యాలను కల్పిస్తే స్థానిక క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకుంటారు. ఇప్పుడున్న ఇండోర్, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాలను అభివృద్ధి చేయాలి. క్రీడా మైదానంలో కనీస సౌకర్యాలను కల్పించడంతోపాటు, నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలి.

- షామీర్‌బాషా, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు

అందులో భా గంగా రాజంపేట క్రీడా మైదానంలో ఇండోర్ స్టేడియాన్ని, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాన్ని ఏర్పా టు చేశారు. దీంతో ఈ క్రీడా మైదానానికి ఎంతో ప్రాముఖ్యత వచ్చింది. ఈ స్టేడియాల్లో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, జిమ్, అథ్లెటిక్స్ లాంగ్‌జంప్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తుండేవారు. రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లు కూడా నిర్వహించారు.

క్రీడా ప్రాంగణంలోనే సబ్‌స్టేషన్

గత పాలకులు పట్టించుకోకపోవడంతో క్రీడా మైదానం ప్రాంగణంలో ఓ వైపున సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో జానీబాషాపురం ఆనుకుని ఉన్న సుమారు 3 ఎకరాల పైబడి క్రీడా మైదానం కంపచెట్లకు నిలయంగా మారింది. ఈ ప్రాంతంలో ఏదైనా స్టేడియాన్ని ఏర్పాటు చేస్తే అందరికి ఉపకరించేది. ఆ ఖాళీ ప్రాంతాన్ని పట్టించుకోకపోవడంతో కంప చెట్లు బాగా ఏపుగా పెరిగి విషసర్పాలు తిరుగుతూ, పందుల నివాసానికి ఉపయోగపడుతోంది. ఇక క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ పాదచారులు నడవడానికి ట్రాక్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ద్వారా కొన్ని ట్రాక్‌లు ఏర్పాటు చేసినా నాణ్యత లోపం కారణంగా ఉపయోగంలో లేవు.

ఆగిపోయిన అభివృద్ధి

ప్రస్తుతం ఇండోర్ స్టేడియం, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం పూర్తిగా పాడైపోయాయి. ఇండోర్ స్టేడియంలోని గదుల ఉన్న తలుపులు, కిటికీలు ఆకతాయిలు ధ్వంసం చేశారు. మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి జిల్లాకు చెందినవాడే అయినా, ఈ క్రీడా మైదానాన్ని పట్టించుకోకపోవడంపై విద్యార్థులు, క్రీడాకారులు అసంతృప్తి చేస్తున్నారు. కాగా, క్రీడా మైదానాన్ని ఆనుకుని నిర్మించిన గదులను అద్దెకు ఇవ్వడం ద్వారా లభించిన ఆదాయాన్ని కూడా అభివృద్ధికి కేటాయించడంలేదు. దీంతో ప్రస్తుతం ఈ మైదానం మార్నింగ్ వాకర్స్‌కు మాత్రమే ఉపయోగపడుతోంది.

స్పోర్ట్స్ అథారిటీ దృష్టి సారించాలి

రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన రాజంపేట పట్టణంలో జాతీయ స్థాయి వాలీబాల్ , షటిల్, బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. అయినా వారికి సరైన తర్ఫీదు లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది. ఉన్నత పాఠశాలలో ఇరువురు ప్రధాన వ్యాయామ ఉపాధ్యాయులు, ఒక కాం ట్రాక్టు వ్యాయామ ఉపాధ్యాయుడు ఉన్నా వారి వల్ల ప్రయోజనం చేకూరడంలేదు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.



మందుబాబులకు అడ్డాగా మారిన గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం


క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్


క్రీడా మైదానంలో పరిచిన కంకర

కరాటే పోటీల్లో కుప్పం క్రీడాకారుల సత్తా..

కడప స్పోర్ట్స్ జూలై 20 (ఆంధ్రజ్యోతి): జెన్ షిటో ర్యూ కరాటే డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప మునిసిపల్ మైదానంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 4వ సౌత్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ క్రీడా పోటీలలో కుప్పం క్రీడాకారులు సత్తా చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు ఏపీ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోలా ప్రతాప్‌కుమార్ వెల్లడించారు. పోటీలకు నాలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది క్రీడాకారులు హాజరుకాగా, ప్రారంభోత్సవానికి కడప మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రాకేష్ హాజరయ్యారు. అసోసియేషన్ కార్యదర్శి విజయ్ సారథ్యం వహించారు. బీజేపీ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, బొమ్మన విజయ్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్, కడప కరాటే అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం. విజయ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రొద్దుటూరు ,జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా అవుతున్న జియో నెట్‌వర్క్‌కు చెందిన ఇనుప స్తంభాన్ని తాకడంతో ఓ ఆవు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పట్టణం శాస్త్రినగర్‌లోఆదివారం ఈ సంఘటన చోటుచేసుకోగా, విద్యుత్ అధికారులు గానీ, జియో కంపెనీ అధికారులు గానీ అటు వైపు తొంగి చూడలేదు. స్థానికులు చనిపోయిన ఆవుకు పూజలు చేశారు. జియో నెట్‌వర్క్‌కు చెందిన స్తంభాలు విద్యుత్ విద్యుత్ లైన్లకు సమీపంలో ఉండకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

బంగారు నగలు చోరీ.. కేసు నమోదు

నిమ్మనపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీరువాలో దాచి ఉంచిన బంగారు నగలు అపహరణకు గురయ్యాయని కొండయ్యగారిపల్లికి చెందిన రెడ్డెప్పరెడ్డి, శోభారాణి దంపతులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ 4 జతల కమ్మలు, చైన్‌లు, ఇతర వస్తువులు కలిపి సుమారు 500 వందల గ్రాములు బంగాలు నగలు చోరీ అయ్యాయని బాధితులు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని, ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించామన్నారు. వారం రోజుల క్రితం ఇంటి పనులు చేసేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులపై బాధితులు అనుమానం వ్యక్తం చేశారన్నారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి దొంగలను పట్టుకొనేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

పట్టపగలే బంగారు అపహరణ

రాజుపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో శనివారం పట్టపగలు బీరువా పగలగొట్టి ఐదు తులాల బంగారు దోచుకెళ్లినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. ధనిరెడ్డిస సుశ్మిత అనే మహిళ ఇంటిలోని బీరువా పగలగొట్టి మూడు తులాల నల్లపూసల దండ, 2 తులాల గొలుసు దోచుకెళ్లినట్లు తెలిపారు. అదే గ్రామంలో ముందుగా ఒక ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు అక్కడ ఏమీ లేకపోవడంతో రెండో ఇంటిలో చోరీ చేశారు. తెలిపారు. గత వారంలో కూడా టంగుటూరులో ప్రసాద్ అనే వ్యక్తి ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు దోచుకెళ్లనట్లు తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ.. 8 మందిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాలు ఘర్షణ పడడంతో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తవళం పంచాయతీ చౌకిళ్లవారి పల్లికి చెందిన కొందరు వ్యక్తులు పబ్లిక్ స్థలంలో గొడవపడి, దాడి చేసుకున్నారన్నారు. ఇరువర్గాలకు చెందిన 8మందిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ధ్వంసం చేసినందుకు..

చాపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసినందుకు మండలంలోని పడమర అనంతపురం గ్రామానికి టీడీపీ నాయకులునందిమండలం మల్లికార్జునరెడ్డి, బాలసుబ్బారెడ్డిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 19న శనివారం తిప్పిరెడ్డిపల్లె దళితవాడలోని సిమెంటు రోడ్డును వీరు ఎక్స్‌కవేటర్‌తో పగులకొట్టి ధ్వంసం చేశారన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు వీరిపై కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

నిమ్మనపల్లిలో 144 సెక్షన్ అమలు.

నిమ్మనపల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి మండలంలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్ రెడ్డిని మద్యం కేసులో శనివారం సిట్ అరెస్ట్ చేయడంతో, ఎలాంటి అల్లర్లు జరగకుండా , ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 144 సెక్షన్‌ను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


టైరు పేలడంతో తుప్పల్లోకి దూసుకెళ్లిన కారు

కొండాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంజిఅనంతపురం సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం ప్రొద్దుటూరు నుంచి తాడిపత్రికి వెళుతున్న కారు టైరు పేలిపోయింది. దీంతో కారు రోడ్డు పక్కకు దిగి తుప్పల్లోకి దూసుకుపోయింది. బెలున్‌లు తెరుచు కోవడంతో అందులో ప్రయాణిస్తున్న తండ్రి, కూతుళ్లు సురక్షితంగా బయట పడ్డారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదని స్థానికులు తెలిపారు.

మిథున్ అరెస్టుపై రాద్ధాంతం తగదు

- టీడీపీ, జనసేన, బీజేపీ నేతల విమర్శలు


సమావేశంలో మాట్లాడుతున్న తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, జనసేన నేత రాందాస్‌చౌదరి

మదనపల్లె టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఏపీ లిక్కర్ స్కామ్‌లో నిందితుడైన మిధున్‌రెడ్డిని అరెస్టు చేస్తే మదనపల్లె వైసీపీ నేతలు ఉలిక్కిపడి రాద్ధాంతాం చేయడం తగదని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు విమర్శించారు. ఆదివారం స్థానిక దేవతానగర్‌లోని టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిక్కర్‌స్కామ్ నిందితుడు మిధున్‌రెడ్డి సుప్రీం కోర్టు, హైకోర్టుకు ముందస్తు బెయిల్ కోసం ఎందుకు దరఖాస్తు చేసుకున్నాడన్నారు. వైసీపీ పాలనలో లిక్కర్ కల్తీతో జంగారెడ్డిగూడెంలో 27 మంది మృతి చెందిన విషయం వైసీపీ నేతలు మరచిపోయారా అని ప్రశ్నించారు. రూ.వేలాది కోట్లను హవాలా రూపంలో తరలించారన్నారు. జగన్ కూడా జైలుకు పోయే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి కూడా మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో అరెస్టు కాక తప్పదన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం భూకబ్జాలకు పాల్పడిన విషయం ప్రజలకు తెలుసన్నారు. మిధున్‌రెడ్డి అరెస్టుపై వైసీపీ నేతలు జైళ్ల గోడలు బద్దలు కొడతామనడం శాంతిభద్రతలకు విఘాతమే అన్నారు. జనసేన రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ గంగారపు రాందాస్‌చౌదరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో మద్యం దుకాణాల వద్ద డిజిటల్ పేమెంట్స్ ఎందుకు అనుమతించలేదన్నారు. నగదుతోనే మద్యం విక్రయించడంలో పరమార్థం ఏమిటన్నారు. మద్యం దుకాణాల నుంచి వచ్చిన సొమ్మంతా తాడేపల్లె ప్యాలెస్‌కు తరలించారన్నారు. వైసీపీ పాలనలో స్కాములు, హత్యలు, జైళ్ల అరాచక పాలన సాగించారన్నారు. జగన్ వ్యక్తిత్వానికి భయపడిన ప్రజలు ఆయనకు కేవలం 11 సీట్లు మాత్రమే ఇచ్చాని గుర్తు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చెప్పినట్లు అవినీతిపరులను చెత్త ఊడ్చినట్లు ఊడ్చి వేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దొరస్వామి నాయుడు, దేవరింటి శ్రీనివాసులు, నాదెళ్ల అరుణ్‌తేజ, మహబూబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను పట్టుకోమంటే.. మాపైనే కేసులు పెడతారా?

- బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్


శివప్రసాద్ ఇంటికి నోటీసులు అంటిస్తున్న పోలీసులు

మదనపల్లె, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుతో బాధ పడుతున్న తనతోపాటు, నిందితులను పట్టుకోమని డిమాండ్ చేసిన దళిత సంఘాలపై పోలీసులు కేసులు పెట్టి వేధిస్తున్నారని బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ ఆరోపించారు. అంకిశెట్టిపల్లె గుట్టపై వెలసిన గౌతమ బుద్ధుడి తల నరికిన నిందితులను పట్టుకోమంటే, ప్రశ్నించిన దళిత సంఘాల నేతలపై కేసులు పెట్టి వేధించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు ఎస్పీ తమపై వేధింపులకు పాల్పడుతున్నాడని శివప్రసాద్ ఆరోపించారు. తాను కోలార్ ఆస్పత్రికి వెళ్లి వచ్చేలోగా తనపై పెట్టిన మూడు తప్పుడు కేసులకు సంబంధించిన నోటీసులు తమ ఇంటికి అంటించి అవమానించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీ నన్ను ఏం చేయాలను కుంటున్నాడో తెలియడం లేదని, తాము బుద్ధిస్టులమని, ఎవరిని ఇబ్బంది పెట్టే వాళ్లం కాదని, అయితే ఇన్ని ఇబ్బందులు పెడుతున్న పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

జర్నలిజం లలితకళల కోర్సుల్లో నేటి నుంచి నేరుగా ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వ విద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లమో కోర్సులలో ప్రవేశానికి ఈనెల 21 నుంచి 31 వరకు నేరుగా ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహి స్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. జర్నలిజం శాఖ ఆధ్వర్యంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ పబ్లిక్ రిలేషన్ (పీజీడీపీఆర్), పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ తెలుగు జర్నలిజం (పీజీడీటీజే), ఫైన్ ఆర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ డిప్లమా ఇన్ థియేటర్ ఆర్ట్స్ కోర్సులకు ప్రవేశాల కౌన్సెలింగ్ జరగనుందన్నారు. పీజీ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. కౌన్సెలింగ్‌కు అ భ్యర్థులు అన్ని రకాల అర్హత పత్రాలతోనేరుగా యూనివర్సిటీలో హాజరుకావాలని సూచించారు. వివరాలకు యోగివేమన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.వైవీయు.ఇడియు.ఇన్ ను సందర్శించాలని సూచించారు.

బైకును ఢీకొన్న లారీ .. ఒకరికి తీవ్రగాయాలు

ముద్దనూరు జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామం వద్ద శనివారం రాత్రి బైకును లారీ ఢీకొనడంతో రవిశంకర్ అనే వ్యక్తికి తీవ్రగాయలైనట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. పులివెందులకు చెందిన రవిశంకర్ ఎర్రగుంట్ల వైపు నుంచి బైకుపై పులివెందులకు వెళుతుండగా, అదే వైపు వెళుతున్న లారీ తిమ్మాపురం స్పీడ్ బ్రేకర్ వద్ద ఢీకొనడంతోపాటు బైక్‌ను కొంతదూరం లాక్కొని వెళ్లింది. దీంతో రవిశంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరులోని ప్రభుత్వ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు హైదరాబాదుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

- రూ.1.45లక్షలు, బైక్‌లు, కార్లు స్వాధీనం

చక్రాయపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 1,45,100 స్వాధీనంచేసుకున్నట్లు సీఐ ఉలసయ్య తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ చక్రాయపేటకు తూర్పు దిక్కున 3 కిలోమీటర్ల దూరంలో మల్లెపల్లె రాజశేఖర్‌కు చెందిన నిమ్మతోటలో నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై ఆదివారం దాడులు చేశామన్నారు. 11 మందిని అరెస్టు చేసుకొని, రూ. 1,45,100 నగదు, 11 మొబైల్ ఫోన్లు, 4 మోటార్ సైకిళ్లు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పాట్ వాల్యుయేషన్ నిధులను వెంటనే చెల్లించాలి

ఎస్‌టీఎఫ్ డిమాండ్



మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు సంబంధించిన స్పాట్ వాల్యూషన్ నిధులను ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కడప నగరం జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2025 పదో తరగతి పరీక్షలకు సంబంధించి చీఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్,స్క్వాడ్‌ల రెమ్యునరేషన్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఉన్నారు. బదిలీల్లో రీఅపోస్‌మెంట్‌లో వచ్చిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు బాలకృష్ణ, రవిశంకర్, వివిధ మండలాల అధ్యక్షప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్.సి. కృష్ణస్వామి రాజు బాలసాహిత్యంపై 27న సదస్సు

కడప కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యం లోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సారథ్యంలో నిర్వహిస్తున్న నెలనెలా సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా 145వ సదస్సు ఈనెల 27వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి. పార్వతి తెలిపారు. ఇందులో ఆర్.సి.కృష్ణస్వామిరాజు బాలసాహిత్యం అనే అంశంపై విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ నెమిలేటి కిట్టన్న (తిరుపతి) ప్రసంగించనున్నారని వెల్లడించారు. సాహితీప్రియులు, అభిమానులు, తప్పక హాజరుకావాలని కోరారు.

బీజేపీకి అనుకూలంగా పనిచేస్తున్న ఎన్నికల కమిషన్

సీపీఎం కడప జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఆరోపణ

కడప సెవెన్ రోడ్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల కమీషన్ బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని కడపలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో, ఆదివారం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సీపీఎం కడప జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పత్రిక ప్రకటనను విడుదలచేశారు. ఎన్నికల సంఘం బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు ఆదేశించిందన్నారు.ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా 2025 ఆగస్టు 8న దేశవ్యాప్తంగా నిర్వహించాలని సీపీఐ (ఎం) పిలుపునిచ్చిందన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలి

కడప సెవెన్ రోడ్స్‌జూలై 20 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన కందిపప్పు,కోడిగుడ్లు, పాలు, చిక్కీలు ఇతర సరుకులు పంపిణీ చేయడం లేదని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా వాపోయారు. ఆదివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏఐటీయూసీ ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బాదుల్లా మాట్లాడుతూ జిల్లాలో బద్వేల్ తదితర ప్రాంతాల్లోని అంగన్వాడీ సెంటర్స్‌కు అందజేస్తున్న కందిపప్పు పుచ్చుపట్టి పురుగులతో బూజుపట్టి నాశిరకంగా ఉంటే ఆహారం వికటించే ప్రమాదం ఉందని అంగన్వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే ప్రభుత్వం ఇచ్చిన పప్పునే అందజేశామని బుకాయిస్తున్నారన్నారు. అంగన్వాడీల దగ్గర ముందుగానే వేలిముద్రలు చేసుకొని రెండు,మూడు రోజుల తర్వాత సరుకుల సరఫరా చేస్తుండడంతో వాటిని గుర్తించలేకపోతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి అంగన్వాడీ సెంటర్లకు అందించే సరుకులు నాణ్యతగా ఉండేలా తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చెన్నూరు,జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఇర్కాన్ సర్కిల్ నుంచి కమలాపురం పోయే దారిలో బైపాస్‌రోడ్డు క్రాస్‌వద్ద ద్విచక్రవాహనం రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని ఆదివారం రాత్రి ఢీకొనడంతో రామిరెడ్డి కొట్టాలకు చెందిన హరిప్రసాద్(35) మృతి చెందగా మరొకరు సతీశ్‌కుమార్ గాయపడ్డాడు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మన వీధిని మనమే బాగు చేసుకుందాం

● సింహాద్రిపురంలో స్వచ్ఛందంగా మురుగు కాలువలు శుభ్రం చేసుకున్న వీధి ప్రజలు

సింహాద్రిపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మన వీధిని మనమే బాగుచేసుకుందామంటూ సింహాద్రిపురం 5వ వార్డులోని మహిళా మండలి వీధిలోని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నడుం బిగించారు. దాదాపు 20 సంవత్సరాల క్రితం సింహాద్రిపురంలోని 5వ వార్డులో పోలింగ్ బూత్ 21లో మహిళా మండలి వీధిలో సిమెంటు రోడ్డు



ఇళ్ల వద్ద ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగిస్తున్న ప్రజలు

వేసి, రోడ్డు కిరువైపులా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేశారు. కానీ డ్రైనేజ్ నీళ్లు పోవడానికి మెయిన్ రోడ్డు కాలువకు కలుపకుండా అసంపూర్తిగా ఆపేశారు. దీంతో డ్రైనేజీ కాలువలు మట్టితో పూడిపోయాయి. దీనికి తోడు కొంతమంది ఇళ్ల ముందు డ్రైనేజీ కాలువపై మెటికలు కట్టుకోవడంతో రోడ్డు వెడల్పు తగ్గడంతోపాటు మురుగు నీరు సిమెంటు రోడ్డుపై ప్రవహిస్తూ, అక్కడక్కడ మురుగు నీరు ఆగి వుండటంతో ప్రజలు నడవడానికి ఇబ్బందిగా తయారైంది. కొంతమంది ఆ వీధి ప్రజలు డ్రైనేజీ సమస్యను పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారం కావాలంటే వీధిలోని ప్రజలందరూ సహకరించాలని బీటెక్ రవి






డ్రైనేజీ కాలువలో మట్టి తొలగిస్తున్న యువకులు

సూచించారు. వేంపల్లి మండల టీడీపీ పరిశీలకుడు అజ్జుగుట్టు రఘనాథరెడ్డి వారికి కావలసిన ట్రాక్టరు, తదితర ఏర్పాట్లు చేశారు. దీంతో ఆ వీధిలోని యువకులు, మహిళలు, చిన్న పిల్లలతో సహా డ్రైనేజీ కాలువల్లో మట్టి తీయడం, ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న మెటికలు తొలగించడం, తదితర పనులు మూడు రోజుల పాటు చేపట్టారు. ఎట్టికేలకు డ్రైనేజీ నీళ్లు ఎక్కడా ఆగకుండా మెయిన్ రోడ్డు కాలవలో కలిసేటట్లు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఆ వీధిలోని సమస్య తీరినట్లయింది.

గంగమ్మకు పూజలు



సీకేదిన్నె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చింత కొమ్మ గంగమ్మ తల్లికి భక్తులు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా గంగమ్మ తల్లి భక్తుల నమ్మకం. దీంతో భక్తుల కోర్కెలు నెరవేరడంతో అమ్మవారిని పసుపు, కుంకుమ, కొత్తబట్టలను సమర్పించి వారి మొక్కులు తీర్చుకుని పిల్లాపాపలు చల్లంగా ఉండాలని, పాడిపంటలు పండాలని కోరుకున్నారు. సమీపంలోని ఆలయాల్లో సైతం భక్తులు పూజలు నిర్వహించారు.

వర్షం కోసం విరాటపర్వం పఠనం

లింగాల,జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబకపల్లె గ్రామంలో ఆదివారం పెద్దమ్మతల్లి ఆలయంలో విరాటపర్వం పఠనం గావించారు. పూజారి రామకృష్ణారెడ్డి, బండి చిన్నశివారెడ్డి ఉపవాసంతో విరాటపర్వంపఠనం చేశారు. ఈ సందర్భంగా పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలుచేసి 101 బిందెల నీటితో అభిషేకించారు. ప్రజలు పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. తీర్థప్రసాదాలు పంచి పెట్టడంతో కార్యక్రమం ముగిసింది.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వీరపునాయునిపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం 1986-91 బ్యాచ్ పూర్వ విద్యార్థినీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. స్థానిక ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థినీ విద్యార్థులు 35ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకొని ఆనందంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ బడి పరిసరాలను చూసి ఉద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు రషీద్, గంగిరెడ్డి,ఈశ్వర్‌రెడ్డి, టీవీ కృష్ణారెడ్డి, తులసీశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, గంగాధర్‌రెడ్డి, ధర్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రమీలకన్యాకుమారి, సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత వివి సుబ్బానాయుడు, ప్రధానోపాధ్యాయురాలు సుభాషిణి, గణిత ఉపాధ్యాయుడు రమేష్‌లకు శాలువాలు కప్పిపూలమాలలతో, మెమెంటోలు అందించి సత్కరించారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైంది

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, సీఈఓ శ్రీదేవి

కడప ఎడ్యుకేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ వృత్తి అతి పవిత్రమైందని సాయిబాబా విద్యాసంస్థల అధినేత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం కడపనగరం సాయికృప నర్సింగ్ కళాశాలలో ల్యాంప్ లైటింగ్ అండ్ ఓత్ సెర్మని కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో డాక్టర్లతో పాటు నర్సులు చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. నర్సింగ్ వృత్తిలో ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పారు. విద్యాసంస్థల సీఈఓ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకొని చదువుకోవాలని కోరారు. అనంతరం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యావతి, రిమ్స్‌నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్లు రమణమ్మ, కాంతమ్మ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పగడాలపల్లె గంగమ్మతల్లికి బోనాలు

పెండ్లిమర్రి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని పగడాలపల్లె గంగమ్మతల్లికి ఆదివారం ద్వారకానగర్‌కు చెందిన మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు.మహిళలు అందరూ బోనాలు వండుకుని కుడలను తలపై పెట్టుకుని డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి గంగమ్మతల్లికి మొక్కుబడులు చెల్లించారు.

'తాడేపల్లి లిక్కర్ స్కాం దేశ చరిత్రలోనే పెద్దది'

కమలాపురం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం వైరల్ అవుతున్న తాడేపల్లి లిక్కర్ స్కాం దేశంలోనే అతిపెద్ద స్కామ్ అని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎంపీగా గెలిచి ప్రజలకు సేవ చేయాల్సింది పోయి జగన్ నడిచే అడ్డదారిలో నడుస్తూ కల్తీ మద్యంతయారీ యాజమాన్యంతో చేతులు కలిపి చీప్‌లిక్కర్ వైన్‌షాపు ద్వారా అధిక ధరలతో అమ్మిస్తూ వేల కోట్లు పక్కదారి పట్టిస్తున్న మిథున్‌రెడ్డిని మద్యంస్కాంలో అరెస్టు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ అవినీతి పాలన చూసి ప్రజలు 11 సీట్లు ఇచ్చారని, ఇప్పటికైనా మారుతారనుకుంటే కూటమి ప్రభుత్వం నాయకుల మీద అసభ్యకర పదజాలంతో మాట్లాడుతూ ప్రజల్లో ఇంకా దిగజారిపోతున్నారన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఎదుగుదల లోపాలపై నిర్లక్ష్యం వద్దు

కడప సెవెన్ రోడ్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో ఎదుగుదల లోపాలను ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిదని ప్రముఖ చైల్డ్ సైకాలజిస్ట్ డాక్టర్ సోమేశ్వర్ తెలిపారు. కడప పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్ అనే అంశంపై అషూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆటిజం పిల్లలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ అర్జున్, రిమ్స్ పీడియాట్రిక్ హెచ్‌ఓడీ డాక్టర్ వంశీధర్, ప్రముఖ చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ ఓబుల్‌రెడ్డి , రత్న స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ స్పీచ్ థెరపిస్టులు బాబురావు, ప్రవల్లిక, అషూర్ సంస్థ ప్రతినిధులు న్యాయవాది కిషోర్‌కుమార్, నాగరాజు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల సమస్యను లోకేశ్ దృష్టికి తీసుకెళ్తాం

వేంపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో కోట్లాది రూపాయలతో నిర్మించి మధ్యలోనే ఆగిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణాల పనుల సమస్యను మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు. వేంపల్లెలో అసంపూర్తిగా ఉన్న డిగ్రీ కళాశాల భవన సముదాయాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీవీ రమణ, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



ఉచిత రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రామగోపాల్‌రెడ్డి, తులసిరెడ్డి తదితరులు

వేంపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక చైతన్య హైస్కూల్లో ఆదివారం తిరుపతికి చెందిన రమాదేవి మల్టీసూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రారంభించారు. అనంతరం పలురకాల జబ్బులకు వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ డాక్టర్ బాష, మానవత సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు యోగేశ్వర్‌బాబు, రిటైర్డ్ లెక్చరర్ మీగడ రామమునిరెడ్డి పాల్గొన్నారు. అలాగే మానవత సంస్థ ద్వారా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. పలువురు రక్తదానం చేశారు.

ఓపెన్ టెండర్ ప్రక్రియ చేపట్టాలి

కడప సెవెన్ రోడ్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.10కోట్లకు పైబడి టెండర్లకు కనీసం 14రోజుల గడువుతో ఓపెన్ టెండర్‌లు పిలిచే ప్రక్రియను పక్కనపెట్టి ఏకపక్షంగా కాంట్రాక్టర్‌కు టెండర్ కట్టబట్టేందుకు షార్ట్‌టెండర్‌ను ప్రకటించడం దారుణమని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ విమర్శించారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కడప అభివృద్ధి పనులకు మొదటిసారి విడుదల చేసిన రూ.20కోట్లు నిధులు పనులుటెండర్ల దశలోనే పారదర్శక, జవాబుదారితనం లోపించడం దారుణమన్నారు. 20న ఆదివారం టెండర్‌పై పత్రికల్లోప్రకటన వస్తే 19న శనివారం 5గంటలకు టెండర్ డౌన్‌లోడ్ ప్రారంభించి జూలై 21వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సమయంతో షార్ట్ టెండర్ ప్రకటించడం విడ్డూరమన్నారు. షార్ట్ టెండర్ రద్దుచేసి ఓపెన్ టెండర్‌ను పిలవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

రాచిన్నాయపల్లె - ముండ్లపల్లె కాల్వల్లో పూడిక తీత



చెన్నూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసీ కెనాల్ ఆయకట్టుకింద ఉన్న రాచిన్నాయపల్లె - ముండ్లపల్లె ప్రాంత రైతులకు ఖరీఫ్‌లో సక్రమంగా నీరందేందుకు ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సొంత నిధులతో ఆదివారం పూడిక తీత పనులు చేపట్టారు. సుమారు మూడు కి.మీ మేర కాల్వలో వేగవంతంగా పూడిక తీసే పనులు చేపట్టడం జరిగింది. ముండ్లపల్లె టీడీపీ నాయకుడు అల్లాడు రాజగోపాల్‌రెడ్డి రెండు ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి ఈ కాలవల్లో పూర్తిగా నీరు సక్రమంగా పారేందుకు పనులు చేపట్టించారు. అలాగే ఆయకట్టు రోడ్డులో ఎక్కడ కంపచెట్లు ఉన్నా వాటిని తొలగించడం, గ్రావెల్‌తో రోడ్డు ఏర్పాటు చేసే పనులను చేపడతున్నట్లు తెలిపారు. రాచిన్నాయపల్లె, ముండ్లపల్లె కాల్వలో ఈ పూడిక తీత పనులను టీడీపీ నేత రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి సొంతనిధులు అందిస్తానని, పనులు పూర్తిచేస్తానని చెప్పడం జరిగింది. ఈ మేరకు పనులు మొదలుపెట్టారు.

బోరు వేశారు - కనెక్షన్ మరిచారు



సీకేదిన్నె, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లో విశ్వనాథపురం శ్మశాన వాటికలో ప్రజల అవసరాల కోసం బోరు వేశారు. దీంతో నీళ్లు కూడా బాగా పడ్డాయని, అందుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్, కరెంటు స్తంభాలు శాక్షన్ అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మోటారుకు కనెక్షన్ ఇస్తే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, అదే విధంగా శ్మశాన అవసరాలతోపాటు తాగునీటి అవసరాలు కూడా తీరేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు.

ఘనంగా సర్పశాంతి హోమం



సుబ్రహ్మణ్యం స్వామి

కడప కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆడి కృత్తికను పురస్కరించుకుని నగర ఆకులవీధిలో వెలసిన రాజ రాజేశ్వరీదేవి దేవస్థానంలో ఆదివారం ఘనంగా సర్పశాంతి హోమం నిర్వహించారు. హోమ కార్యక్రమానికి ముందుగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరింపచేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం కమనీయంగా సాగించారు. కాగా సర్పశాంతి హోమ కార్యక్రమాన్ని మహిళా భక్తులు పెద్ద ఎత్తున తిలకించారు.

వైభవంగా ఆడికృత్తిక



కమలాపురం రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) :సుబ్రహ్మణ్యేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన ఆషాఢ మాస కృత్తికా నక్షత్రం సందర్భంగా మండల పరిధిలోని రామాపురం మహా పుణ్యక్షేత్రంలో వెలసిన షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ఆడికృత్తిక మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం మాడవీధుల్లో ఆలయ వ్యవస్థాపకుడు కాశీభట్ల సత్యసాయినాథశర్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కావడి ఉత్సవం జరిగింది. మయూర వాహనంపై వల్లి దేవసేన స్వామివారి ఊరేగింపు నిర్వహించారు.

చౌడేశ్వరిదేవికి ఆషాఢం సారె

చెన్నూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులో కొలువై ఉన్న రామలింగ చౌడేశ్వరి దేవికి ప్రజలు ఆషాఢం సారె సమర్పించారు. ఆదివారం ఉదయం స్థానిక సరస్వతీనగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కొత్తరోడ్డులోని సరస్వతినగర్, లక్ష్మీనగర్, శ్రీరామ్‌నగర్ తదితర ప్రాంత మహిళలు అమ్మవారికి సమర్పించే సారెలో బుట్టలను పవిత్రంగా పూజించి అందులో చీర, జాకెట్లు, పూజాద్రవ్యాలు తదితరాలను తలపై ఉంచుకుని అమ్మవారిని స్మరిస్తూ మంగళవాయిద్యాలనడుమ ఊరేగింపుగా తరలివెళ్లారు. ఉదయం 8.30 నుంచి ప్రారంభమైన ఊరేగింపు దాదాపు 3.30గంటల పాటు మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకెళ్లారు. కాగా ఈ నెల 24న అమ్మవారి జయంతి సందర్భంగా నాలుగురోజులు ముందుగా అమ్మవారికి పుట్టింటి నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సారెను తీసుకెళ్లడం జరిగింది.



ట్యాంకర్లతో నీటి సరఫరా



మైలవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామచంద్రాయపల్లె గ్రామంలో ఆదివారం ట్యాంకర్లతో అధికారులు నీటిని సరఫరా చేశారు. గత కొన్ని రోజులుగా రామచంద్రాయపల్లె గ్రామంలో నీటి సమస్య ఉండడం, గ్రామంలో ఎంతకు పరిష్కారం కాకపోవడంతో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి గ్రామస్థులు విషయం తెలుపడంతో ఆయన అధికారులతో మాట్లాడి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీంతో అధికారులు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు.

విగ్రహం ధ్వంసం

ముద్దనూరు జూలై20(ఆంధ్రజ్యోతి):మండల పరిధి జమ్మలమడుగు ఘాట్ రోడ్డులోని ఏసుక్రీస్తు విగ్రహంను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కోలాప్రసాద్ తెలిపారు. ఆమేరకు ఆదివారం పులివెందుల పాస్టర్ అసోసియేషన్ కిరణ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ మైనుద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. విగ్రహం ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కుల సంఘం వైస్‌చైర్మన్‌గా రామమోహన్‌రెడ్డి



కొండాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కుల సంఘం రాయలసీమ రీజనల్ వైస్ చైర్మన్‌గా మండ లంలోని పెంజి అనంతపురం గ్రామానికి చెందిన కె.రామమోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళ పట్ల జరుగుతున్న దాడుల పై, అత్యాచారాలపై, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై పోరాటానికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తనను నియిమించిన జాతీయ సంఘం చైర్మన్ తాళ్లూరి ప్రసన్నకు మార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వర్షం వస్తే చాలు.. ఆ రోడ్లు చెరువులే



దువ్వూరు మండలంలోని జిల్లేళ్లలో చెరువుగా మారిన సిమెంటు రోడ్డు



రాజుపాళెం మండలం టంగుటూరు బీసీ కాలనీలో రోడ్డు దుస్థితి

దువ్వూరు/రాజుపాళెం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షం వస్తేచాలు దువ్వూ రు, రాజుపాళెం మండలంలోని కొన్ని గ్రామాల్లోని రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. దువ్వూరు మండలంలోని జిల్లేళ్ల గ్రామంలో స్వల్ప వర్షానికే రోడ్డుపై నీరు నిలిచి కుంటను తల పిస్తోంది. దీంతో గ్రామ ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. కొన్నేళ్ల కిందట వేసిన సిమెంటు రోడ్డు పాడైంది. ఎందుకో ఈదారి వెంబడి గ్రావెల్‌ను తోలారు. ఇలా సిమెంటు రోడ్డు మీద గ్రావెల్ పరచడంతో ఇబ్బంది కలుగుతుందని గ్రామస్థులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మజను వివరణ కోరగా సిమెంటు రోడ్డు మీద గ్రావెల్ తోలిన మాట వాస్తవమని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక రాజుపాలెం మండలంలోని అర్కటవేముల, తొండలదిన్నె, టంగుటూరు, రాజుపాలెం తదితర గ్రామాల్లో రోడ్లన్నీ తగ్గుగా ఉండడంతో వర్షాలు పడినప్పుడు నీరు నిలిచి పాదాచారులు సైతం వెళ్లడానికి వీలులేకుండా ఉం టోంది. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తే తప్ప వాటి సమస్య పరిష్కారం కాదని ప్రజలు పేర్కొంటున్నారు. అయితే అధికారులు మాత్రం 16వ ఆర్థిక సంఘం నిధులు గత రెండు నెలల నుంచి పంచాయతీలోకి రాకపోవడంతో పారిశుధ్యం, మంచి నీటి సౌకర్యానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు కేటాయిస్తే ఈ పనులు పూర్తి చేయవచ్చని వారంటున్నారు.

బద్వేలు సంత మార్కెట్‌లోకి లోడింగ్ తరలింపు



రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న వారికి సూచనలు ఇస్తున్న కమిషనర్

బద్వేలు, జూలై20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డు కూరగాయల మార్కెట్ వద్ద లోడింగ్, అన్‌లోడింగ్ ఇక నుంచి సంత మార్కెట్‌లోనే నిర్వహించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి సూచించారు. నిత్యం రద్దీగా ఉన్న విషయం ప్రజలందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, పోలీసుశాఖ ఆదేశాల మేరకు అక్కడి వ్యాపార కార్యకలాపాలు పాత సంత మార్కెట్‌లోకి మార్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ సూచించారు. ఈ మేరకు వ్యాపారులు, వినియోగదారులు మైదుకూరు రోడ్డు పాత సంత మార్కెట్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వినియోగదారులు సహకరించాలని కమిషనర్ సూచించారు.

గుండె జబ్బులున్న వారు అప్రమత్తంగా ఉండాలి

- ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం లో డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి



గుండె పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి

ప్రొద్దుటూరు , జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గుండె జబ్బులున్న వారు ఆ లక్షణాలు కనపడగానే అప్రమత్తమై వెంటనే వైద్యుడిని సంప్రదించాలని లేకేంటే ప్రాణాలకే ప్రమాదమని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పాతకోట శ్రీనాధ్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక నెహ్రూరోడ్డులో ఉచిత గుండె కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గుండె జబ్బులు గల పేషంట్లకు 55మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారిలో 28 మందికి ఉచితంగా ఈసీజీ, 8 మందికి ఉచితంగా గుండెస్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ హరిత 36 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

బాధితుడికి స్నేహితుల ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

ఎర్రగుంట్ల, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలంలోని చిలమకూరులో ఇటీవల ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగి నష్టపోయిన బాధితుడికి సహచ ర మిత్రులు రూ.40వేలు ఆర్థిక సహాయం అందించారు. చిలమకూరుకు చెందిన తలారి చలమయ్య ఇంటిలో ఇటీవల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిద అయ్యాయి. దీంతో పాటు రూ.30వేలు నగదుకూడా అగ్నికి ఆహుతి అయ్యింది. ఈవిషయంపై స్పందించిన చిలమకూరు జడ్పీ హైస్కూల్ 1998-99 బ్యాచ్ పూర్వవిద్యార్థులు, చలమయ్య మిత్రులు రూ.40వేలు ఆర్థిక సహాయాన్ని ఆది వారం అందించారు. ఈ కార్యక్రమంలో కె.గురప్ప, కె.గురుశేఖర్, జి.ప్రవీణ్, అనిల్, లక్ష్మిప్రసన్న, సుదర్శన్‌లు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లామహాసభలను జయప్రదం చేయండి

బద్వేలు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్ పిలుపునిచ్చారు. స్థానిక భాకరాపేట సమీపంలోని ఈశ్వర్‌రెడ్డి కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఐ భారతదేశంలో అవతరించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నదన్నారు. అనంతరం ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరగనున్న జిల్లా మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల సమితి నాయకులు సుబ్బారెడ్డి, తిరుమల కృప, వెంకటేశ్, రమణయ్య, శ్రీను, దేవి, రాజశేఖర్, అభిరామ్, సౌందర్య పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు

బద్వేలు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరీ సమావేశాల్లో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎస్సీ హాస్టల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ సమావేశాల కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్రీనివాసులు, పట్టణ ఉపాధ్యక్షులు సుశాంత్, రాజశేఖర్, సుదర్శన్, శివానంద్, సంతోష్ పాల్గొన్నారు.

ఏపీ ఉద్యోగుల తాలూకా నూతన సంఘం ఎన్నిక



బద్వేలు రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హుసేనయ్య, కార్యదర్శిగా పుష్పరాజ్, కోశాధికారిగా విజయకుమార్, అసోసియేట్ ప్రెసిడెంటుగా బాలయ్య, ఉపాధ్యక్షులుగా నరసింహప్రసాద్, బ్రహ్మాజీ, లక్ష్మీదేవి, శ్రీహరి, సుబ్బరాయుడు, రఘునాధరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా లక్ష్మీదేవి మహిళా సెక్రటరీగా సుబ్బలక్షుమ్మను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రఘురామనాయుడు, జిల్లా కార్యదర్శి క్రిష్ణప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, రిటైర్డ్ ఏఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే డబ్బులు తీసుకున్నది వాస్తవం కాదా!

మైదుకూరు రూరల్, జులై 20(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ చైర్మన్ అయిన తన వద్ద నుంచి ఒక కోటీ రూపాయలు మధ్యవర్తుల సాయంతో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తీసుకొన్నాడని మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర తెలిపారు. శనివారం వైసీపీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ చైర్మన్ మాజీ ఎమ్మెల్యేకు డబ్బులు ఇవ్వడం అనే విషయంలో వాస్తవం లేదని తెలుపడంపై స్పందించిన చైర్మన్ తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేను నా కుటుంబంతో కలిసి గ్రామ దేవత పెద్దమ్మతల్లి వద్ద ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, మరీ మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో పాషా, షౌకత్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కాశినాయన జూలై20ఆంధ్రజ్యోతి)కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానా లను ప్రజల్లోకి తీసుకుపోయి ఎండగట్టాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నర్సాపురంలో వైసీపీ అధిష్టానం పిలుపుమేరకు నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి అదనపు సమన్వయకర్త మండలంలో కీలకమైన నేత నల్లేరు విశ్వనాద్‌రెడ్డి వర్గం సమావేశానికి డుమ్మాకొట్టింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధా, బద్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కరెంట్ రమణారెడ్డి,మండల కన్వీనర్ హనుమంతురెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం నాయకుడు ఆదిత్యరెడ్డి పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో తాలూకా యూనిట్ ఎన్నిక



జమ్మలమడుగు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ఆదివారం ఏపీఎన్జీవో తాలూకా యూనిట్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నిక ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. జమ్మలమడుగు ఎన్నికల యూనిట్ తరుపున మొత్తం 12 మంది కార్యవర్గ సభ్యులు నామినేషన్ వేసినట్లు 12 స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ వేయడంతో అధ్యక్షుడు పోరెడ్డి నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కార్యదర్శిగా వీరారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ రఫిక్, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు, నాగేంద్రారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, బి.రమాదేవి, జాయింట్ సెక్రటరిగా గంగాధర్, కె.మనోహర్, శ్రీనివాసులు విజయమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి భారతి, కోశాధికారి ఎన్‌ఎస్.ప్రవీణకుమారి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ కమిటీ మూడు సంవత్సరాలు కొనసాగుతుందన్నారు.

పెద్దమ్మతల్లికి ఆషాఢ మాస ప్రత్యేక పూజలు



మైదుకూరు రూరల్, జులై 20(ఆంధ్రజ్యోతి):ఆషాఢ మాస చివరి ఆదివారం పురష్కరించుకుని పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా మైదుకూరులోని పాతూరులో వెలసిన గ్రామదేవత పెద్దమ్మతల్లికి వేకువ జామునుంచే అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలకు పెద్దమ్మతల్లికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో అమ్మవారు దేదీప్య మానంగా భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లిని భక్తులు దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రెడ్డివారిపల్లెలో ఘనంగా పోలేరమ్మకు బోనాలు



రెడ్డివారిపల్లెలోపోలేరమ్మకు బోనాలు తీసుకువెళుతున్న మహిళలు

బి.కోడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రెడ్డివారిపల్లె గ్రామంలో శ్రీరామ నూతన విగ్రహ ప్రతిష్ఠ, గుడి నిర్మాణమై 41 రోజులు అయిన సందర్భంగా ఆదివారం పోలేరమ్మతల్లికి వేడుకగా గ్రామస్థులు బోనాలు సమర్పించారు. అంతకు ముందు గ్రామస్తులంతా కలిసి బోనాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, విరివిగా పాల్గొని పూజలు చేశారు.

వర్షాలు కురిపించమ్మా! పోలేరమ్మకు పూజలు



పూజలునిర్వహిస్తున్న భక్తులు

పోరుమామిళ్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : చల్లంగా చూడమ్మా! వర్షాలు కురిపించి పొలాలను సస్యశ్యామలం అయ్యేలా చేయమ్మా! అంటూ మండలంలోని బుచ్చంపల్లె గ్రామస్థులు గ్రామదేవత పోలేరమ్మకు ఆదివారం పూజలు నిర్వహించారు. పోరుమామిళ్ల మండలంలోని బుచ్చంపల్లెలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తి కావస్తున్న సందర్భంగా ఆది అమ్మవారికి గ్రామస్థులంతా భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం బంధువులు, స్నేహితులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు టీడీపీ నాయకులు, వైసీపీ నాయకులు హాజరయ్యారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు హాజరైన డీసీసీబీ చైర్మన్



అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన డీసీసీ బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

గోపవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గోపవరం మండలంలోని సంద్రపల్లిలో అంకాలమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ఆదివారం డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి హాజరై అమ్మ వారిని దర్శించుకున్నారు. అంకాలమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తికావడంతో వేద పండితులచే కుంభాభిషేకం, కుంకుమార్చన రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ జయరామిరెడ్డి ఆహ్వానం మేరకు డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి హాజరై వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌రెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, వెంగల్‌రెడ్డి, రాధాక్రిష్ణారెడ్డి, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణకు యత్నం..అడ్డుకున్న అధికారులు

అట్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) :అట్లూరు మండలంలోని మాడపూరు రెవెన్యూ గ్రామ పొలంలో సర్వే నెం.1039లో 4.30 ఎకరాలు ప్రభుత్వ భూమిని సుబ్బయ్య అనే వ్యక్తి యంత్రాలతో చదును చేసి ఆక్రమణకు యత్నించడంతో అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. ఆదివారం ప్రభుత్వ భూమిని సుబ్బయ్య చదును చేస్తున్నారన్న సమాచారం తెలియడంతో రెవెన్యూ అధికారులు ఆర్‌ఐ రమణ, వీఆర్వో దస్తగిరి పొలం వద్దకు వెళ్లి పరిశీలించిన ఆక్రమణకు యత్నించిన సుబ్బయ్యను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తనకు పట్టా ఇచ్చిందని పట్టాదారు పాస్‌పుస్తకం ఉందని తెలపడంతో అధికారులు పూర్తి వివరాలతో సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్దకు వచ్చి సమగ్ర వివరాలు అందజేయాలని రైతుకు సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

రాజుపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండా లని ఎస్‌ఐ కత్తి వెంకటరమణ పేర్కొ న్నారు. ఆదివారం వెంగలాయపల్లె గ్రామంలో ప్రజలతో ముఖాముఖి మా ట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, ఆన్‌లైన్ మోసాలు తదితర వాటిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించా రు. అపరిచిత వ్యక్తులు గ్రామంలో ఎవరైనా కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత బైకులు నడిపేట ప్పుడు ఖచ్చితంగా హెల్మెట్‌వాడాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు తెలపాలన్నారు. మహిళలు బంగారం వేసుకుని పంట పొలాల్లో ఒంటరిగా వెళ్లకూడదన్నారు. ఏదైనా సమస్య ఉంటే ప్రజలు పోలీసులకు తెలపాలన్నారు.

ఆక్రమిత భూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల తొలగింపు

కాశినాయన జూలై20(ఆంధ్రజ్యోతి)మండలంలోని నాయనపల్లె సమీపంలోగల ప్రభుత్వ కొండ పోరంబోకు భూముల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించినట్లు తహసీల్దారు వెంకటసుబ్బయ్య, మండల ట్రాన్స్‌కో ఏఈ రవీంద్రానాద్ తెలిపారు. కొందరు ఆక్రమణదారులు ప్రభుత్వ కొండ పోరంబోకు భూములను పెద్దఎత్తున ఆక్రమించి అనధికారికంగా విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేసుకున్న విషయం ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్, బదేల్వ్ ఆర్డీవోలు పలుమార్లు పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ట్రాన్స్‌కో డీఈ రవిచంద్ర చూచనలతో మండల ఏఈ రవీంద్రనాద్ పోలీస్ బందోబస్తు మధ్య 6 ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి నర్సాపురం సబ్‌స్టేషన్‌కు తీసుకు వచ్చారు.

కలుషిత నీరు సరఫరా.. ఆందోళనలో ప్రజలు

జమ్మలమడుగు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో ఆదివారం మధ్యాహ్నం కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అయిందని ఆ ప్రాంతవాసులు వాపోయారు. ఉదయం నుంచి నీటి సరఫరా లేదని, మధ్యాహ్నం నీళ్ల సరఫరా చేయడంతో స్థానికులు కుళాయిల వద్ద కొందరు నీటిని పట్టుకున్నారు. అయితే సరఫరా అయిన నీటిలో ఇసుక, ఎర్రమట్టి వచ్చిందని తెలిపారు. ఈ సమస్యకు సంబందించి స్థానికులు మున్సిపల్ డీఈకి తెలియజేసినట్లు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకుని సమస్య రాకుండా చూడాలని కోరారు.

బడుగు బలహీనవర్గాల అభివృద్ధే సీఎం లక్ష్యం

బ్రహ్మంగారిమఠం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికే నిరంతరం సీఎం చంద్రబాబునాయుడు కృసి చేస్తున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, యువ నాయకుడు కాణాల మల్లిఖార్జునరెడ్డిలు అన్నారు. ఆదివారం మండలంలోని రేకలకుంటపంచాయతీ బూత్‌నెం.231, డి.అగ్రహారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఈ సంవత్సరకాలంలో చేపట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గుజ్జు రామాంజనేయులు, పెరుగు నాగేంద్ర, పుట్టాల శివాయాదవ్, నాగిపోగు మధు, నాగిపోగు దాసు, బుజ్జి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

కలసపాడు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేస్తూ వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఎస్‌టీయు ఆధ్వర్యంలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు.కలసపాడు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి, ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు రమణారెడ్డి, సుబ్రమణ్యం, కవిత మాట్లాడుతూమారుమూల ప్రాంతంలో బాధ్యతాయుతంగా పనిచేసిన ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు శాలువ పూలమాలలతో ఘనంగాసన్మానించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖర్‌బాబు, సత్యనారాయణ, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనవాసులు, సత్యం, శివారెడ్డి, అబ్దుల్, ఉసేన్ జయరామిరెడ్డి తదితరులుపాల్గొన్నారు.